# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో జరిగే శ్రీ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాల్లో ఈరోజు పాల్గొంటారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ సత్యసాయి, వైయస్సార్ కడప జిల్లాల్లో ఈరోజు పర్యటిస్తారు.**

3. **ధాన్యం కొనుగోళ్ళలో రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

4. **కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణకు ఉన్న హక్కులను పరిరక్షించుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **మానవ జీవితంలో శౌచాలయాల ప్రాధాన్యతను తెలియజేస్తూ ఈరోజు ప్రపంచ శౌచాలయాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

===========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తారు. ఇందులో భాగంగా పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. ఢిల్లీ నుంచి బయలుదేరి సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి సాయి కుల్వంత్ సభా మందిరం చేరుకొని సత్య సాయి మహాసమాధి వద్ద ప్రార్థనలు చేస్తారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శ్రీసత్యసాయి స్మారక నాణెం, తపాలా బిళ్ళలను ప్రధానమంత్రి విడుదల చేస్తారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియం చేరుకొని అక్కడ జరిగే సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో పాల్గొంటారు. తర్వాత, ప్రధానమంత్రి తమిళనాడులోని కోయంబత్తూరుకు వెళ్లి దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సును ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీఎం-కిసాన్ పథకం నిధులు 18 వేల కోట్ల రూపాయలను దేశవ్యాప్తంగా 9 కోట్ల మంది రైతుల ఖాతాలకు విడుదల చేస్తారు. అనంతరం ఏర్పాటు చేసే సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ సత్యసాయి, వైయస్సార్ కడప జిల్లాల్లో ఈరోజు పర్యటిస్తారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి ప్రధానమంత్రితో కలిసి శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం వైయస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం

పెండ్లిమర్రికి  చేరుకుంటారు. స్థానికంగా ఉన్న గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని సందర్శించి అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగిస్తారు.

---------------------------

క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోళ్లను నిర్వహిస్తూ  రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పౌరసరఫరాల భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, 32 వేల 793 మంది రైతుల నుండి 2 లక్షల 36 వేల 284 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం కొనుగోళ్లు చేసి 560 కోట్ల రూపాయల నగదును రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. డిసెంబర్ లోపు కొనుగోళ్ళను పూర్తి చేస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పురాతన ఆలయాల పునర్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవదాయ, ధర్మాధాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. దేవదాయ శాఖ అధికారులతో నెల్లూరులో మంత్రి నిన్న సమీక్షా  సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... ఇప్పటికే 58 ఆలయాల పునర్ నిర్మాణానికి 118 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశామన్నారు. రాష్ట్రంలో 141 ఆలయాలలో ధూప, దీప నైవేద్యాల కోసం ప్రతి నెలా 10 వేల రూపాయలను ఇస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు ఐఐటీ, నీట్ లాంగ్ టర్మ్ శిక్షణా కేంద్రాన్ని నిర్మించినున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడించారు. విజయవాడలోని ఐఐటీ,నీట్ శిక్షణా కేంద్రంలో మంత్రి నిన్న ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, గురుకులాల్లో చదివే ఎస్సి, ఎస్టీ విద్యార్థుల కోసం ఐఐటీ, నీట్ శిక్షణా కేంద్రాలను 3 నుంచి 10కి  పెంచామని చెప్పారు. విజయవాడ కబేలా సెంటర్‌లో 80 లక్షలతో శాశ్వత శిక్షణా కేంద్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు.

---------------------------

పట్టణాభివృద్ధి శాఖ మంత్రుల ప్రాంతీయ సమావేశం నిన్న హైదరాబాద్‌లో జరిగింది. "పట్టణాల్లో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఈ సమావేశంలో చర్చించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, దాద్రానగర్ హవేలీ, కేంద్రపాలిత ప్రాంతాల మంత్రులు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి

ముఖ్య అతిథులుగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

---

కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణకు ఉన్న హక్కులను పరిరక్షించుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలోని శ్రమశక్తిభవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఉత్తమ్ కుమార్ రెడ్డి నిన్న సమావేశమై కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రమంత్రికి వివరించారు. కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆలమట్టి ఎత్తు పెంపుపై పోరాడటానికి న్యాయ కోణాలన్నింటినీ పరిశీలిస్తున్నామన్నారు. అలాగే పోలవరం వరద జలాల తరలింపునూ అడ్డుకుంటామని తెలిపారు. తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరామని మంత్రి వివరించారు.

---

ఆరోగ్యకరమైన జీవనానికి మానవ జీవితంలో శౌచాలయాల ప్రాధాన్యతను తెలియజేస్తూ ఈరోజు ప్రపంచ శౌచాలయాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్లూహెచ్ఓ, ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ బాలల అత్యవసర సహాయ నిధి– యు ఎన్ఐసిఎఫ్‌ల నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ సుమారు మూడు వందల కోట్ల మందికి పైగా ప్రజలకు సురక్షిత పారిశుధ్య సౌకర్యాలు లేవు. నేటికీ చాలా మంది ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేస్తున్నారని గణాంకాలు చెప్తున్నాయి. ప్రజలకు శౌచాలయాల ఆవశ్యకతను తెలియజేస్తూ... ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 2013 నుండి ప్రతి యేటా నవంబర్ 19న ప్రపంచ శౌచాలయాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'మనకు ఎల్లప్పుడూ టాయిలెట్ అవసరం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ శౌచాలయాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---

సాంకేతికత సాయంతో పౌరసేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తెస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు అన్నారు. మెటా సంస్థ, 'మీసేవ' సంయుక్త భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 'మీసేవ సర్వీసెస్ ఆన్ వాట్సప్'ను హైదరాబాద్‌లో మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మీసేవ' ద్వారా అందించే 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కిపైగా పౌరసేవలను వాట్సప్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుతం ఈ సేవలు ఆంగ్లంలో అందుబాటులో ఉన్నాయని త్వరలోనే తెలుగు, ఉర్దూ భాషల్లోనూ తీసుకొస్తామని చెప్పారు. ప్రజలు 8096958096 నంబరుపై ఉండే మొబైల్ వాట్సప్ ద్వారా 'మీసేవ' సేవలన్నీ పొందవచ్చని శ్రీధర్ బాబు తెలిపారు.

---

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 22వ తేదీన అల్పపీడనం ఏర్పడనుందని, ఇది పశ్చిమ వాయవ్య

దిశగా కదిలే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది.

ఇక తెలంగాణ రాష్ట్రంలోనూ చలి తీవ్రత కొనసాగుతోంది. ఆదిలాబాద్‌లోని కుమరంభీం, ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి.

======================